విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి ఒక్కరికి అవసరం

విశాలాంధ్ర-మచిలీపట్నం : ప్రపంచ దేశాలలో కంప్యూటర్ విస్తరణకు స్థాపనకు భారత దేశ యువత పునాదిరాళ్లు అని మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ టీ. పెద్దిరాజులు అన్నారు. ఆదివారం రాజ్ ఇన్ఫో సొల్యూషన్స్ కాన్విగేషన్ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులు అందరూ కచ్చితంగా కంప్యూటర్ పై పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా ప్రతిదీ కంప్యూటర్‌తో అనుసంధానం అయిందన్నారు. భారతదేశం భవిష్యత్తు నేటి యువత భుజస్కందాలపై ఉందని, యువత సక్రమ మార్గంలో దిశానిర్దేశం చేసుకొని ప్రయాణం చేయాలని అన్నారు. మచిలీపట్నంలో కొన్ని వందల మందికి కంప్యూటర్‌పై డిగ్రీలు అందజేస్తున్న రాజ్ ఇన్ఫో సొల్యూషన్స్ అధినేత ఓల్లి రాజేష్ నీ పెద్దిరాజులు అభినందించారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ పోరాటాల పురిటి గడ్డ మచిలీపట్నంలో జన్మించిన యువత మరింత ముందుకు వెళ్లాలని అన్నారు. పత్రికా రంగంలో కృష్ణ పత్రిక, బ్యాంకింగ్ రంగంలో ఆంధ్ర బ్యాంకు, దక్షిణాది రాష్ట్రాల్లో మొట్టమొదటి కాలేజీ నోబెల్ కాలేజీని, జాతీయ పతాకాన్ని అందించిన నేల మచిలీపట్నం అని, ఇక్కడ జన్మించడమే అదృష్టమని బాలాజీ అన్నారు. డిగ్రీలు పూర్తి చేసుకున్న 300 మందికి సర్టిఫికెట్లను పెద్దిరాజులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒల్లి మధుసూదన్‌రావు దంపతులు, కంప్యూటర్ అధ్యాపకులు సంస్థ విద్యార్థులు, పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా...

విశాలాంధ్ర-మచిలీపట్నం : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు నేతృత్వంలో యావత్ జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి సెప్టెంబర్ 30వ తేదీ నుండి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శిబిరాలను సజావుగా నిర్వహిస్తోంది. ప్రజలందరి ఆరోగ్యం పరిరక్షించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని సంకల్పించింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదల ఇంటి గడప వద్దకే కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతి ఇంటికి వాలంటీర్లు, ఏఎన్ఎంలు వచ్చి కుటుంబంలోని ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి సమీపంలో షెడ్యూల్ ప్రకారం నిర్వహించే వైద్య ఆరోగ్య శిబిరాలకు వచ్చి వైద్యులకు చూపించుకుని మందులు ఉచితంగా అందజేస్తున్నారు. ఒకవేళ ఏదేని అనివార్య కారణాల వలన ఇంటి వద్ద వైద్య పరీక్షలు చేయించుకోని వారు నేరుగా వైద్య శిబిరానికి వచ్చి కూడా వైద్య పరీక్షలు చేయించుకోవచ్చు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 5,53,642 ఇళ్లకు గాను 3,74,837 ఇళ్లకు ఏఎన్ఎంలు వెళ్లి ఆరోగ్యపరమైన స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేశారు. 15,023 మంది కంటి పరీక్షలకు హాజరు కాగా వారిలో అవసరమైన 3, 966మందికి కంటి అద్దాలు కూడా ఉచితంగా పంపిణీ చేసారు. వైద్య శిబిరంలో 231 మంది సాధారణ వైద్యులు, 113 మంది ప్రత్యేక వైద్యులు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రజలందరూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ పి.రాజాబాబు కోరారు.

వైసీపీ ప్రతినిధుల సభకు పటిష్ట బందోబస్తు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): వైసీపీ ప్రతినిధుల సభకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతి రాణా తెలిపారు. ఆదివారం బందోబస్తు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈనెల 9తేదీన విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగబోవు వైసీపీ ప్రతినిధుల సభ సమావేశ కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా స్టేడియంలో, పరిసర ప్రాంతాలలో కట్టుదిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాట్లపై పర్యవేక్షించి, ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం, పార్కింగ్ ప్రదేశా వివరాలను తెలుసుకుని అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రతినిధుల సభకులో పాల్గొనడానికి ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ముఖ్య నాయకులు సభకు వస్తారని, స్టేడియంలో కట్టు దిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ విశాల్‌గున్ని, అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, డీసీపీ సీఎస్‌డబ్ల్యూ ఏటీఎస్ ఉదయ్‌రాణి, రామకృష్ణ, ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ తలశీల రాఘురామ్, క్రైమ్ ఏడీసీపీ పి.వెంకట రత్నం, సీఎస్‌బీ ఏడీసీపీ రమణమూర్తి, ట్రాఫిక్ ఏడీసీపీ డి.ప్రసాద్, తదతర అధికారులు పాల్గొన్నారు.

షాదీ ఖానా పనులు నిలిచిపోవడానికి వైసీపీ ముస్లీం నాయకులే కారణం : అబూ

విశాలాంధ్ర-గుడివాడ : పేద ముస్లీంలు పెళ్లిలకు అతి తక్కువ ధరకు షాదీ ఖానలో అవకాశం కల్పించి అభివృద్ధి చేస్తుంటే వైసీపీకి చెందిన కొంత మంది నాయకులు పనులు అడ్డుకోవడమే కాకుండా కమిటీ సభ్యులపై లేనిపోని ఆరోపణలు చేయడం హేయమైన చర్య అని షాదీ ఖానా కమిటీ అధ్యక్షా, కార్యదర్శిలు మహ్మద్ ఖాసీం(అబూ), షేక్ ఇబ్రహీంలు అన్నారు. ఆదివారం స్థానిక ముబారక్ సెంటర్‌లోని నైజంపేటలోని ఇబ్రహీం స్వగృహంలో షాదీ ఖాన కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల ఒక పత్రికలో షాదీ ఖానా అభివృద్ధిపై వార్త రావడం జరిగిందన్నారు. అయితే కొంత మంది వైసీపీ ముస్లీం నేతలు ఈ విషయంలో కమిటీ సభ్యులపై లేనిపోని ఆరోపణ చేయడం జరిగిందన్నారు. షాదీ ఖానా విషయంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కొన్ని కోట్ల రూపాయిలు తీసుకు వచ్చి ప్రహరి నిర్మాణం. ఎత్తు పెచ్చడం, నూతనం నిర్మించేందుకు రూ 96లక్షలు మజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వారా నిధులు తీసుకు వచ్చి నిర్మణం చేస్తుంటే కావాలని కొంత మంది నిర్మాణం అడ్డుకోవడం జరిగిందన్నారు. పనులు నిలిచిపోవడంతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని, వైసీపీ నాయకుడు దుక్కిపాట శశిభూషణ్ దగ్గరకు వెళ్ళితే ముస్లీం మైనార్టీ మంత్రికి షాదీ ఖానాకు నిధులు విడుదల చేయాలని లేటర్ కూడ ఇవ్వడం జరిగిందన్నారు. అయితే కొంత మంది ఐరన్‌ను దొచుకునే నాయకులు కమీటి సభ్యులపై ఆరోపణలు చేయడం దారుణమన్నారు. షాదీ ఖాన విషయంలో వైసీపీ మైనార్టీ నాయకుల బహిరంగంగ చర్చకు వస్తే తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఎంపి బాలశౌరి ద్వారా 2కోట్లు నిధులు ఇప్పిస్తే దానికి మా పూర్తి సహకరం ఉంటుందన్నారు. ఇప్పటికైన షాదీ ఖానా నిర్మాణం పనులు చేయాడానికి ముందుకు రావాలి అంతే కానీ లేని పోని ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చారించారు. ఈ సమావేశంలో కమీటి సభ్యులు అబ్దుల్ మున్వర్, ఎండి అబ్దుల్ బాషా, అబ్దుల్ నసీమ్, షేక్ మెబీన్ కరీముల్ల తదితరులు పాల్గొన్నారు.

ప్రతినెలా 1న జీతాలు చెల్లించండి: డీటీఎఫ్

విశాలాంధ్ర పెదపారుపూడి : ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రతినెల 1వ తేదీనే జీతాలు చెల్లించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శి రావెళ్ళ వరుణ కుమార్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆదివారం ఫోన్లో ఆయన మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా ఆలస్యంగా జీతాలు చెల్లించటం వలన ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులు ప్రతినెలా కట్టవలసిన లోన్ ఈఎంఐలు సకాలంలో చెల్లించకపోవడం వలన అనేక ఇబ్బందులు ఉన్నందున ప్రభుత్వం వెంటనే స్పందించి సకాలంలో జీతాలు చెల్లించాలని ఆయన కోరుతున్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని దీక్షలు

విశాలాంధ్ర - గుడివాడ : టిడిపి నాయకుడు చంద్రబాబు నాయుడుకు న్యాయదేవత కళ్ళు తెరచి న్యాయం చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 26వ రోజు రూరల్ మండల నాయకులు కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ దీక్షలను టిడిపి పట్టణ, రూరల్, నందివాడ మండల అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, దానేటి సన్యాసిరావు, సర్పంచ్ కాకరాల సురేష్‌లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారం అడ్డు పెట్టుకుని కొంత మంది న్యాయవాదులతో అక్రమంగా లేని పోని సృష్టించి కేసును సాగదీస్తునరన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొట్లూరి వెంకటకృష్ణారావు, షేక్ జానీ షరీఫ్, నిమ్మగడ్డ వెంకటకృష్ణారావు, పొట్లూరి రమాదేవి, శొంఠి నాగేశ్వరరావు, కర్రి వెంకటగిరి, చీకటి శేషగిరి, రేమల్లె రజనీకాంత్, తేరా మార్కరాజు, జోగి సాంబశివరావు, సమ్మెట బ్రహ్మాజీ, దొండపాటి మహేష్, కైలా కాళిదాసు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రిలే దీక్షలు చేపట్టిన కాగిత

విశాలాంధ్ర-బంటుమిల్లి :- పెడన నియోజక టీడీపీ ఇంఛార్జి కాగిత కృష్ణప్రసాద్ న్యాయకత్వంలో టీడీపీ జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా ఆదివారం బంటుమిల్లి మండలంలో కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముందుగా నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పెడన నియోజక వర్గ టీడీపీ ఇంఛార్జి కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అరెస్టు వైసీపీ ప్రభుత్వం యొక్క నిరంకుశ వైఖరికి నిదర్శనమని, ఈ అక్రమ అరెస్టును ఖండిస్తూ మేము సైతం అంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు రిలేదీక్షలు చేపట్టారని కాగిత అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పరసా జితేంద్రా, పరసా సూరిబాబు, కొమ్మన శివ, గంజాల చింటు సంఘీభావం తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు కూనపురెడ్డి వీరబాబు, అంగర రంగనాద్, అట్లూరి రమేష్, బడుగు వెంకటేశ్వరరావు, టిడిపి కార్యకర్తలు దీక్షాశిబిరంలో కుర్చున్నారు.

పురిటిగడ్డలో బాబుతో నేను

విశాలాంధ్ర-చల్లపల్లి : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చే సిన వైనాన్ని ప్రజలకు తెలియచేసేలా చేపట్టిన "బాబుతో నేను" కార్యక్రమం పురిటిగడ్డ గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా నేత, క్లస్టర్ ఇన్చార్జి మోర్ల శివ, యూనిట్ ఇన్చార్జి దేవభక్తుని గోపాలకృష్ణ, ఎంపీటీసీ రాజులపాటి అంకమ్మ, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కైతేపల్లి శ్రీనివాసరావు, తెలుగుయువత నేత రాజులపాటి జగదీష్, తాతా సుబ్బారావు, పీత నాగేశ్వరరావు, దేవనబోయిన నాంచారయ్య, జంపాల సాంబయ్య, సమ్మెట నరేష్, నడకుదిటి జగదీష్, జంపాన వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి బాబుతో నేను కరపత్రాలను ప్రజలకు అందించి రాజకీయ కక్షతో చంద్రబాబును అరెస్ట్ చేసిన విధానాన్ని ప్రజలకు తెలియచేశారు. చంద్రబాబుకు పలువురు మద్దతు తెలియచేస్తూ మిస్ కాల్ ఇచ్చారు. బాబుతో మేము అంటూ నినదించారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు సాలిపేటలో 76, 77, 78, 79 బూత్ పరిధిలో బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. బూత్ ఇన్చార్జి సుబ్బు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మ పోరాటంలో అంతిమ విజయం న్యాయానిదే....

విశాలాంధ్ర-నందిగామ: నందిగామ పట్టణం రైతుపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం టీడీపీ అధినేతల, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ, వెంటనే నారా చంద్రబాబు నాయుడుని వెంటనే విడుదల చేయాలని బాబు కోసం మేము సైతం అంటూ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష ఆదివారానికి 26వ రోజుకి చేరుకున్నాయి. ఈ దీక్షలో వీరులపాడు మండలం గోకరాజుపల్లి, జమ్మవరం, బోడవాడగ్రామ మహిళ, తెదేపా మహిళల నేత లతోపాటు జనసేన మరియు తెదేపా నేతలు దండలను వేసి వారి దీక్షను ప్రారంభింపజేసి వారి దీక్షకు సంఘీభావం తెలియజేసిన మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత రాజ్యాంగం కాపాడాలని న్యాయం ధర్మం జరగాలని మన రాజ్యాంగం చాలా గొప్పది అన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్ని తప్పుడు కేసులు పెట్టిన చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా బయటికి వస్తారని మాజీ ఎమ్మెల్యే సౌమ్య అన్నారు. చంద్రబాబు నాయుడు జాతి సంపదని ప్రతి ఒక్కరు ఆయన కోసం పోరాటం చేస్తున్నారని తెలిపారు. రాజకీయాల శాశ్వతం కాదని జగన్ రెడ్డి తెలుసుకోవాలన్నారు. రాష్ట్రంలోరేపు రాబోవు పార్టీ తెలుగుదేశం అని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై శ్రద్ధ పెట్టాలి : జెడ్పీటీసీ

విశాలాంధ్ర-గన్నవరం : జ్ఞాన సముపార్జనకు ఎన్నో మార్గాలు ఉన్నాయని, అన్నింటిలో పుస్తక పఠనం ఉత్తమమైన మార్గమని దానిపై గ్రామంలోని విద్యార్థులను ప్రొత్సహించే విధంగా గ్రామ పెద్దలు శ్రద్ధ తీసుకోవాలి అని ఆదివారం గన్నవరం మండలం పురుషోత్తపట్నం గ్రంథాలయంలో లైబ్రేరియన్ కొలకలూరి కృపానందం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజిబెత్‌రాణి అన్నారు. ఆమె విద్యార్థుల కొరకు స్టోరీ బుక్స్‌కొని ఇచ్చారని, లైబ్రరిని మీరుచక్కగా ఉపయోగించుకోవాలని, పుస్తక పఠనం, కథలు చెప్పడం, కథలు వినడం, వివిధ విభాగాలలో నైపుణ్యాలను వృద్ధి చేయడం ప్రధాన లక్ష్యం అన్నారు. ఇంటర్‌నెట్ నుండి మనకు లభ్యం అయ్యే సమాచారం అంతా పుస్తక పఠనం ద్వారా సంపాదించిన సమాచారం మాత్రమే అని మనం గుర్తించి పుస్తక పఠనంపై విద్యార్థులు దృష్టి పెట్టాలని సూచించారు. మా పిల్లలు చదువుకొనేటప్పుడు గ్రంథాలయాలను ఉపయోగించుకున్నారని, ఈ పుస్తక పఠనమే మా పిల్లలు ఉన్నత. విద్యను అభ్యించడానికి అవకాశం ఏర్పడిందని, మీరు కూడా ఉపయోగించుకోవాలని జెడ్పీటీసీ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమానికి లైబ్రరీ కమిటీ కార్యదర్శి గుమ్మడి వెంకట్రామయ్య అధ్యక్షత వహించారు. కొమ్మినేని పార్థసారథి, కొమ్మూరు సుబ్బారావు, కొడాలి సీతారామయ్య, కొమ్మినేని సీతారామయ్య, కొనసానీ నాగభూషణం, చదలవాడ కోటేశ్వరరావు, పత్తిపాటి చిన్నయ్య, పత్తిపాటి లోకేశ్వరారావు, సత్యం, బండి ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఖాదర్ ఖాన్ ట్రస్ట్ సాయం

విశాలాంధ్ర- చల్లపల్లి : పేద విద్యార్థులకు ఎంఏ. ఖాదర్ ఖాన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించినట్లు ట్రస్ట్ కార్యదర్శి మహమ్మద్ నసీరుద్దీన్ తెలిపారు. ఆదివారం చల్లపల్లిలో ట్రస్ట్ ఆధ్వర్యంలో పది మంది పేద విద్యార్థులకు రూ.75 వేలు ఆర్థికసాయం అందచేశారు. చల్లపల్లి పూర్వవిద్యార్థి ఖాదర్ ఖాన్ పేరుతో ఆయన కుమారులు ఐదేళ్లుగా పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధి మహమ్మద్ జహీరుద్దీన్ చేతులమీదుగా విద్యార్థులకు ఈ సాయం అందచేశారు.

'సమృద్ధి దివాస్'

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : సంకల్ప సప్తాహలో భాగంగా ఆదివారం పెనుగంచిప్రోలు మండలం లోని అనిగండ్లపాడు గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ జ్యోతి బ్రహ్మం ఆధ్వర్యంలో సమృద్ధి దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హలీం మరియు సచివాలయ సిబ్బంది మరియు విఓఏలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీఎం విశ్వకర్మ స్కీం అవగాహన కార్యక్రమం మరియు డిజిటల్ పేమెంట్స్ గురించి తెలిపారు.

రౌడీ షీటర్లకు సీఐ కౌన్సిలింగ్

విశాలాంధ్ర-నందిగామ: నందిగామ పట్టణ పరిధి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ హనీష్ ఎస్ఐ పండుదొర ఆదివారం నందిగామ పట్టణ పరిధిలోని రౌడీ షీటర్‌లను కౌన్సిలింగ్ ఇచ్చారు. పట్టణంలోని రౌడీషీటర్లందరినీ ప్రవర్తనలను మార్చుకొని సమాజంలో మంచివారుగా తనకోసం తన కుటుంబం కోసం మంచి వ్యక్తులుగా మారి ఏ విధమైనటువంటి గొడవలు లేకుండా ఎవరితో గొడవలు పెట్టుకోకుండా సత్ప్రవర్తన కలిగి మంచి నడవడిక ఏర్పరచుకొని, సమాజంలో మంచి వాళ్ళుగా మంచి ప్రవర్తన కలిగి ఉండాలని రౌడీషీట్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

ప్రేరణ కవితా సంపుటి ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్: మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో విల్సన్ రావు కొమ్మవరపు వారి దేవుడు తప్పిపోయాడు పై పీఠికలు, విశ్లేషణలతో కూడిన ప్రేరణ కవితా సంపుటి ఆదివారం సాయంత్రం ఠాగూర్ గ్రంథాలయం హాలులో ప్రముఖ సాహితీవేత్త, సాహితీ విమర్శకులు జి లక్ష్మీ నరసయ్య ఆవిష్కరించారు. ప్రేరణ కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం మల్లెతీగ అధ్యక్షుడు కలిమిశ్రీ పర్యవేక్షించారు. సభకు ముఖ్య అతిథిగా అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ హాజరుకాగా సభాధ్యక్షునిగా ప్రముఖ రచయిత, ఓఎస్‌డి టు ఆంధ్రప్రదేశ్ శాసనసభ చీఫ్ విప్ డాక్టర్ ఎం ప్రభాకర్ వ్యవహరించారు. విశిష్ట అతిథులుగా విద్యావేత్త, కవి మువ్వా శ్రీనివాసరావు, సీనియర్ పాత్రికేయులు, రచయిత అన్నవరపు బ్రహ్మయ్య, డాక్టర్ జి వి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. గ్రంథ సమీక్ష అరసవిల్లి కృష్ణ చేశారు. రచయిత విల్సన్ రావు స్పందన తెలియజేసి ఆయన ధర్మపత్నికి పుస్తకాన్ని అంకితం ఇచ్చారు. తదుపరి కవి సమ్మేళనం జరిగింది. అనంతరం హాజరైన ప్రేరణ వ్యాసకర్తలకు సత్కారాలు జరిగాయి. రాఘవేంద్ర శేఖర్ తదితరులు నిర్వహణ చేశారు.

రేపటితో ముగియనున్న తిరుపతమ్మ ఆలయపాలక మండలి పదవీకాలం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారి పాలకమండలి పదవికాలం ఈ నెల 10వ తేదీతో ముగియనుంది. కావున ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఆలయ పాలక మండలిసమావేశం నిర్వహించారు. ధర్మ ప్రచారంలో భాగంగా అమ్మవారి ఆలయం తరుపున మాస పత్రిక ఏర్పాటు గురించి కమిషనర్‌కి నివేదిక పంపే విషయం ఈ సమావేశంలో అమోదించారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఉన్న గ్రామ దేవతలకు శ్రావణపట్టి సమర్పించేందుకు ఆమోదించటంపై చైర్మన్. కేశవరావు తెలిపారు. పాలక మండలి కాల పరిమితి ముగి యనున్న సందర్భంగా చైర్మన్ ఇంజం చెన్న కేశవరావు మరియు పాలక మండలి సభ్యులు లకుపూల మాలాలతో సాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కేశవరావు మాట్లాడుతూ అమ్మవారి కృపతో ఆలయం అభివృద్ధికి మావంతు కృషి చేశామని. ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి ప్రభుత్వంలో మాకు ఈ అవకాశం ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, టీటీడీ పాలకమండలి చైర్మన్ సామినేని ఉదయభానుకు కృతజ్ఞతలు తెలిపారు. తిరుపతమ్మ అమ్మవారికి జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు.

'11 నుంచి సంక్షేమ పథకాలపై ప్రచారం'

విశాలాంధ్ర-ఎ.కొండూరు : నాలుగున్నర సంవత్సరాలలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం, ప్రభుత్వంపై ప్రతిపక్షాల విష ప్రచారాన్ని తిప్పికొట్టడం, జైల్లో ఉన్న అవినీతిపరుల గురించి వాస్తవాలు ప్రజలకు తెలియజేయడం వంటి అంశాల గురించి ప్రజా ప్రతినిధులు నాయకులు సిద్ధంగా ఉండాలని తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిలగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కంభంపాడు కన్వర్షన్ హాల్‌లో వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్టోబర్ 11 నుండి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలనువివరించటం తో పాటు,మీ కుటుంబానికి జగన్ మోహన్ రెడ్డి తోనే న్యాయం జరిగిందని గుర్తు చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ కు జగన్ ఎందుకు కావాలి? అనేకార్యక్రమంపై దిశా నిర్దేశం వ్యక్తం చేశారు. జగనన్న సురక్ష, జగనన్న ఆరోగ్య సురక్షవంటి పథకాలు పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నాయన్నారు. నాలుగున్నర ఏళ్లుగా సంక్షేమ పథకాలు విప్లవాత్మక సంస్కరణలు సత్ఫలితాలి స్తున్నాయన్నారు. ప్రజలు వాటిని ఆదరిస్తున్నారని, వారి నుంచి జగనన్న పాలన పట్లమంచి ఆదరణ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి చెన్నారావు, జడ్పిటిసి భూక్యా గనియా, వైస్ ఎంపీపీలు గుంటక శివారెడ్డి, సిద్ధం పద్మ, నియోజకవర్గ సర్పంచుల అధ్యక్షుడు తేళ్లూరి సురేష్, మండల గృహసారథుల కన్వీనర్ దాసరి సతీష్, ఎంపీటీసీ కోట పుల్లారావు, గోపాలపురం సర్పంచ్ కోలా శ్రీను, పిఎసిఎస్ అధ్యక్షులు తుమ్మూరు వెంకటేశ్వర రెడ్డి, ఎ.వెంకటరెడ్డి, గుర్రాల వెంకట్రావు, ఖరీదు శివయ్య, బ్రహ్మానంద రెడ్డి, మొర్ల సాంబయ్య, చి మట రామకృష్ణ (రేజా)గంధం వెంకన్న చౌదరి, షేక్ షాజు, పర్వతనేని చంద్రమోహన్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే ప్రత్యేక స్థానం

ముఠా వర్కర్స్ యూనియన్ 26వ మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): విజయవాడ నగరంలో క్లాత్ ముఠా కార్మికుల సమిష్టి కృషితోనే ప్రత్యేక స్థానాన్ని పొందినదని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. విజయవాడ క్లాత్ ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం దాసరిభవన్ వద్ద 26వ మహాసభ యూనియన్ అధ్యక్షులు చీపిల్ల సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న దోనేపూడి శంకర్ మాట్లాడుతూ కార్మిక రంగంలో ఓనర్లను నమ్ముకొని 135 సంవత్సరాలుగా అనేక కుటుంబాలు నాలుగు తరాలుగా ఆధారపడి అభివృద్ధి చెందటం ఏఐటీయూసీ అనుబంధ సంస్థ క్లాత్ మొట్ట వర్కర్స్ యూనియన్‌కే దక్కిందన్నారు. ఓనర్లకు కార్మికులకు వేతన ఒప్పంద సమయంలో చర్చలు ద్వారా సఫలమై సమ్మెలు లేకుండా నేటి వరకు కొనసాగటం శుభ పరిణామం అన్నారు. ఎర్రజెండా అండతో కార్మికులంతా సమిష్టి కృషితో యూనియన్ చర్చలు ద్వారా కార్యక్రమాలలో భాగస్వాములయ్యే పద్ధతి మంచిదన్నారు. రాబోయే కాలంలో రాష్ట్ర అభివృద్ధికి క్లాత్ ముఠా వర్కర్స్ కార్మికులంతా ఎర్రజెండా ఉద్యమానికి, కార్మికవర్గ బలోపేతానికి, సహకరించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ నగరంలో క్లాత్ ముఠా కార్మికులకు గ్రీన్ చొక్కా, కాకి నిక్కర్ యూనిఫామ్‌తో మంచి గుర్తింపు, ప్రత్యేక స్థానాన్ని సంపాదించారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వస్త్ర రంగంలో రేయ్ మాండ్, రామ్‌రాజ్ బడా వ్యాపారవేత్తలకు లాభాలు వచ్చే విధంగా సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తుందని తెలిపారు. కార్మికుల హక్కుల సాధన కోసం, 8 గంటల పనివిధానం, పనికి తగ్గ వేతనం కోసం ఉద్యమాలు చేసి సాధించారని గుర్తు చేశారు. నరేంద్ర మోడీ రైల్వే విమానఎల్ఐసి ఇతర రంగాలను ప్రైవేటు పరం చేస్తుంటే జగన్ వ్యతిరేకించకుండా ఆమోదిస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ చట్టసభలలో శాసనసభ్యులు మనకోసం ఉన్నారా...? బూతులు తిట్టడానికి ఉన్నారా..? అని ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు. గతంలో కమ్యూనిస్టు శాసనసభ్యులు అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చలు జరిపి అభివృద్ధికి సహకరించేవారని గుర్తు చేశారు. రాబోయే కాలంలో వస్త్రలత తను ఇక్కడే నుంచి కాపాడుకునేందుకు, సంఘ సభ్యత్వం పెంచుకుంటూ, యజమానులు, కార్మికుల ప్రయోజనాల కోసం, సమిష్టిగా కృషి చేయాలని, హక్కులు సాధించుకోవాలని తెలిపారు. ముందుగా అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ యూనియన్ ఏర్పడిన దగ్గర్నుండి నేటి వరకు అమరులైన ఎల్ దుర్గారావు, పి సుందర్రావు, బి నాగేశ్వరరావు, పి సర్వేశ్వరరావు, పి టి పోలయ్య, పి గోపికృష్ణలకు నివాళులర్పించారు. ఆహ్వానితులకు శాలువా పూల బొకేలతో కార్మికులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎం సాంబశివరావు ముఠా కార్మిక సంఘ నాయకులు వియ్యపు నాగేశ్వరరావు ఉపాధ్యక్షులు చొప్ప శ్రీరామమూర్తి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి కే రమణ, ముఠా వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కొరగంజి కనకారావు, సీపీఐ సీనియర్ నాయకులు సింగరాజు సాంబశివరావు, నగర యువజన కార్యదర్శి లంక గోవిందరాజులు, ముఠా కార్మిక సంఘం సహాయ కార్యదర్శి పైలా దుర్గాప్రసాద్, కోశాధికారి పిల్ల రాము, ఉపాధ్యక్షులు పిల్లా కృష్ణ ప్రసాద్‌లు మాట్లాడారు. వస్త్రలత క్లాత్ ముఠా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నూతన కమిటీ

విజయవాడ క్లాత్ ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులుగా చిపిల్ల సత్యనారాయణ, కార్యదర్శి పళ్ళ సూర్యారావు, కమిటీ సభ్యులుగా కొరగంజి కనకారావు, పిల్లా కృష్ణ ప్రసాద్, పైల దుర్గాప్రసాద్, పిల్ల రాము, తొత్తడి రామారావు, తొత్తడి వెంకట దుర్గాప్రసాద్, పైలా కామేశ్వరరావు, సీరం నగేష్, కనిశెట్టి ప్రసాద్, పురంశెట్టి చంద్రశేఖర్, గుట్టేటి వెంకటేశ్వరరావు, కాకి శ్రీనివాసరావు, రాయన రవికుమార్, కొండపూ చిన్న, తొత్తడి తులసీరామ్, పీలేరు సాంబశివరావు, కంబపు బెనర్జీ, సరగడ నరసయ్య రెడ్డి, కొండమచిలి శ్రీనులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

దుర్గగుడి ఈవోగా శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దుర్గగుడి ఈవోగా శ్రీకాళహస్తి ఆర్డీవో కే.ఎస్.రామారావుని నియమిస్తూ ఏపీ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు ఇచ్చింది. వారం క్రితం విజయవాడ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్‌ను విజయవాడ దుర్గగుడి ఈవోగా జగన్ సర్కారు నియమించింది. వారం క్రితం జీవో వచ్చినప్పటికి శ్రీనివాస్ ఇప్పటి వరకు చార్జ్ తీసుకోలేదు. దీంతో హడావుడిగా శ్రీకాళహస్తి ఆర్డీవో కేఎస్ రామారావును ఈవోగా నియమిస్తూ తక్షణం చార్జ్ తీసుకోవాలని ఏపీ ప్రభుత్వం ఆదేశించింది.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

-వైసీపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయాలి
-పత్రికా స్వేచ్ఛను కాపాడాలి... హెల్త్ కార్డులు, ప్రమాద బీమా కల్పించాలి
-ఏపీయూడబ్ల్యూజే అర్బన్ కమిటీ, ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

నూతన కమిటీతో యూనియన్ నాయకులు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): వైసీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ప్రెస్ అకాడమీ పాలకవర్గం ఏర్పాటుతో పాటు వృత్తిపరమైన కమిటీలు అన్నిటిని నియమించాలని, రైల్వే పాసులు పునరుద్ధరించాలని ఈ సమావేశం డిమాండ్ చేసింది. ఏపీయూడబ్ల్యూజే అర్బన్ అధ్యక్షులు చావారవి అధ్యక్షతన ఆదివారం ఉదయం విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందుజనార్దన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి, మీడియా స్వేచ్ఛకు తూట్లు పొడిచే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. పాత్రికేయులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. మీడియా, పాత్రికేయులను పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం మీడియా కమిషన్‌ను, పత్రిక చట్టాన్ని తీసుకురావాలని వారు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన స్వేచ్ఛను కాపాడే విషయంలో ఏపీయూడబ్ల్యూజే పోరాటాలు చేస్తుందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఏపీయూడబ్ల్యూజే విజయవాడ కమిటీ, విజయవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు

ఏపీయూడబ్ల్యూజే విజయవాడ అర్బన్ నూతన కమిటీ:

ఏపీయూడబ్ల్యూజే విజయవాడ కమిటీ అధ్యక్షులుగా చావా రవి, ఉపాధ్యక్షులుగా ఎంవి సుబ్బారావు, సురేంద్రకుమార్, కార్యదర్శిగా ఆర్ఎస్ కిరణ్ (వసంత్), కోశాధికారిగా బీవీ శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా జిబి బాబు, జి. శ్రీనివాస్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యం బోరయ్యతో పాటు మరో ఆరుగురిని నూతన కార్యవర్గంగా ఎన్నుకున్నారు.

ప్రెస్ క్లబ్ నూతన కమిటీ :

ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షులుగా కంచల జయరాజ్, ఉపాధ్యక్షులుగా ఎం.మురళీకృష్ణ, టీ.శివరామకృష్ణ, కార్యదర్శిగా దాసరి నాగరాజు, సహాయ కార్యదర్శిగా ఈ.వి కోటిరెడ్డి, పి.రత్నాకర్‌రావు, ట్రెజరర్‌గా సయ్యద్ అహ్మద్ హుస్సేన్‌తో పాటు మరో ఆరుగురిని ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గంగా ఎన్నుకున్నారు.

ఎన్నికల అధికారిగా ఎస్.కె.బాబు వ్యవహరించారు..రెండు కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఈ సమావేశంలో నేషనల్ కౌన్సిల్ సభ్యులు కూన అజయ్‌బాబు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.రమణారెడ్డి, ఏ.పి.ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఏచూరి శివ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దారం వెంకటేశ్వరరావు, జి.రామారావు తదితరులు పాల్గొన్నారు. కొండా రాజేశ్వరరావు కార్యదర్శి నివేదికను, పి.వి శ్రీనివాస్ ఆడిట్ రిపోర్టు సమర్పించారు. ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావును ఘనంగా సత్కరించారు.

విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన సర్దుబాటు చేసిన విద్యుత్ చార్జీలు వెంటనే రద్దు చేయాలని సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు కొట్టు రమణా రావు డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడ 53వ డివిజన్‌లో ఇంటింటికి, వ్యాపార సముదాయాలు వద్ద వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీగా విద్యుత్ చార్జీలు పెంచడం తగదన్నారు. దీనివల్ల ప్రజలకు బిల్లుల షాకు తగులుతుందన్నారు. సర్దుబాటు, ట్రూఅప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు వినియోగదారులపై భారం మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు కే అప్పారావు ఎస్కే మస్తాన్ వల్లి రాంబాబు తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలకు ప్రకృతిలో మలుపు తిప్పే జీవనపాఠాలు

విశాలాంధ్ర-విజయవాడ : ఆదివారం ప్రకృతిలో పిల్లల శిబిరంలో నేర్చుకునే పాఠాలు, వారి జీవనశైలి, జీవితదృక్పథం చక్కని పథంలోకి మళ్ళించగలవని చైతన్య విద్యాసంస్థల అనుబంధ డీన్ డా.మన్నం కృష్ణమూర్తి అన్నారు. వారధి దిగువున ప్రకృతీ పర్యావరణ సంస్థ అవార నిర్వహించిన ప్రకృతీ శిబిరంలో ఆయన మాట్లాడుతూ ఈనాటి పోటీప్రపంచంలో చిన్నారుల మీద పడే వారం ఒత్తిడినుండి ఉపశమనం అందించే శక్తి ఆదివారం అవార ఇచ్చే శిక్షణకు ఉందన్నారు. కమనీయ పరిసరాల్లో, సేద తీరే వాతావరణంలో పిల్లలు ఆలాపించే పాఠాలు, పద్యాలు, చెప్పుకునే పిట్ట కథలు, ఆడుకునే జలక్రీడలు, చిన్నారుల కేరింతలు, చప్పట్లతో నదీప్రాగణం మారుమ్రోగింది. మహిళా ఈత శిక్షకురాలు శకుంతలాదేవి, సమన్వయకర్త సౌజన్య పర్యవేక్షణలో వాలంటీర్లు సుకన్య, జితేంద్ర, అరవింద ఉపాధ్యాయులు షారన్, రావు ఏర్పాట్లు చేసారు. ప్రతి ఆదివారం వేకువనే జరిగే ఈత-ఇంగితం శిక్షణా కార్యక్రమం పట్ల ఆశక్తి గలవారు 9494126812 నందు నమోదుచేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

దోనేపూడికి అభినందనలు

విశాలాంధ్ర-విజయవాడ : సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సమితి సమావేశం విజయవాడలోని దాసరిభవన్‌లో శనివారం తూము కృష్ణయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శిగా దోనేపూడి శంకర్, సహాయ కార్యదర్శిగా బుడ్డి రమేష్‌లను జల్లా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. బాధ్యతలు స్వీకరించిన వీరిని సీపీఐ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు అభినందనలు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన దోనేపూడి శంకర్‌ను వివిధ సంఘాల నాయకులు ఆదివారం విజయవాడ దాసరిభవన్‌లో దోనేపూడిని కలిసి అభినందనలు తెలిపారు. విజయవాడ 49, 50, 54 డివిజన్ల కార్యదర్శులు కమిటీ సభ్యులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇందులో 49, 50, 54, 55 డివిజన్ల ఇంఛార్జి తాడి పైడియ్యా, 49వ డివిజన్ కార్యదర్శి బోరా రామకృష్ణ, 54వ డివిజన్ కార్యదర్శి మురుగేసన్ రాము, నగర కౌన్సిల్ సభ్యులు గాది రాము, బళ్ళా నరసింహరాజు, తిప్పాబత్తుల వెంకటేశ్వరరావు, మోకా దుర్గారావు, టంగుటూరి దనంజ్ కుమార్, కోరంగి చిన్నారావు, మర్రపు నాగేశ్వరరావు, ఇప్పిల రంగారావు, ప్రత్తిపాటి బాబురావు, ఎస్కే.. సిద్దిక్, తదితరులు పాల్గొన్నారు. సీపీఐ తిరువూరు పట్టణ సమితి నాయకులు, విజయవాడ ఆటో వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నాయకులు శంకర్‌ను అభినందించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి విజయవాడ నగర సమితి ఇంచార్జ్ లంక దుర్గారావు, గౌరవాధ్యక్షులు కేవీ భాస్కరరావు, అధ్యక్షులు ఎస్‌కె.నజీర్, కార్యదర్శి దోనేపూడి సూరిబాబు తదితరులు దోనేపూడి శంకర్‌కు అభినందనలు తెలిపారు.

ఆధారాలు లేకుండా అరెస్టు

విశాలాంధ్ర-తాడికొండ : రాజమండ్రి సెంట్రల్ జైలులో జైలు శిక్ష అనుభవిస్తున్న నారా చంద్రబాబునాయుడును ఎలాంటి ఆధారాలు లేకుండా అరెస్టు చేశారని మాజీ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ ఆరోపించారు. చంద్రబాబును విడుదల చేయాలని కోరుతూ స్థానిక అడ్డరోడ్డు సెంటర్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న నిరాహార దీక్ష ఆదివారానికి 26వ రోజుకు చేరింది. శనివారం గుంటూరు నగ రంలో జరిగిన సత్యాగ్రహ ర్యాలీకి హాజరైన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఐటీ రంగం కృష్ణా జలాల పంపిణీ పోలవరం ప్రాజెక్టు దాని ఉపయోగాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయ కులు కంచర్ల శివరామయ్య, తలసిల ప్రసన్న, గుంటుపల్లి మధుసూదన్ రావు, నీలాల కృష్ణారావు, చల్లా వెంకటేశ్వర్లు, షేక్ అలీ, షేక్ యాసిన్, పరుసూరి శివ, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

'మాట' ఉత్సవాలకు శాంతమూర్తికి ఆహ్వానం

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా న్యూజిలాండ్ లో ఈ నెల 28వ తేదిన జరుగబోయే మన ఆంధ్రా తెలుగు అసోసియేషన్- న్యూజిలాండ్ (మాట-ఎన్‌జెడ్) ఉత్సావాలకు చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా, అవర్ స్టేట్ అవర్ లీడర్, వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు జి.శాంతమూర్తికి ఆహ్వానం అందింది. శాంతమూర్తి మాట్లాడుతూ మాట ఉత్సవాలకు ఆహ్వానం అందడంపై సంతోషం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

విశాలాంధ్ర-తాడేపల్లి: హైదరాబాద్ కు చెందిన కాసుల చిత్రకళ అకాడమీ నిర్వహించిన అంతర్జాతీయ చిత్రకళా పోటీలలో రామాయణం అంశం పై వడేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనపరిచారు. వారిలో యస్.శిరీష10వ తరగతి విద్యార్థిని కాంస్య పతకం సాధించగా 12 మంది విద్యార్థులు ప్రశంసా పత్రములు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యా యులు జి.సుబ్బారావు విద్యార్థులను అభినందించారు. చిత్రకాళా ఉపాధ్యాయులు సీహెచ్ సత్యనారాయణ, జోజప్ప, బుజ్జిబాబు, సుందరరాజు, పద్మావతి, జ్ఞానజ్యోతి పాల్గొన్నారు.

43వ డివిజన్‌లో ఆయన రూటే సపరేటు!

-పై అధికారి అండతో వీరంగం
-ఒకసారి సస్పెండ్ అయినా మారని తీరు
-ఫిర్యాదు చేసిన కార్మికునిపై కక్ష సాధింపు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగర పాలక సంస్థలో సర్కిల్-1 పరిధిలోని భవానీపురంలో ఓ శానిటేషన్ ఇనస్పెక్టర్ రూటే సపరేటుగా మారింది. ఆయన ఏంచేసినా అడిగేవారులేక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో కార్మికులు విలవిల్లాడిపోతున్నారు. నగరంలో ఎక్కాడాలేని విదంగా ఆయన డివిజవన్ల్లో ఆయనకు అనుకూలంగా ఒక వర్గం, వ్యతిరేకంగా ఒక వర్గంగా తయారు కావటంతో స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఆయన, ఆయన అనుంగులు ఘనకార్యాలను ప్రశ్నించన వారంతా ఒక వర్గంగా, ప్రశ్నించే వారు వ్యతిరేక వర్గంగా మారి డివిజన్‌లో శానిటేషన్ అస్తవ్యస్తంగా మారింది. ఆయనతో పాటు ఆయనకు అనుకూలురైన ఇద్దరు అనదికారిక మేస్త్రీలు తోడై కార్మికులను కాల్చుకుతింటున్నట్లు బాదిత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ముఠాకు పై అధికారి అండదండలుండటంతో కార్మికులపై కక్ష సాదింపులు, మామూళ్లు వసూళ్లు యదేశ్చగా కొనసాగుతున్నాయని స్థానికంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఓ కార్మికుడు తన సోదరుడు మరణించి 15 రోజులు సెలవు పెట్టి అనంతరం విదులకు హాజరైంతే మామూళ్ళు ఇస్తేనే విదులకు అనుమతిస్తానని కరాకండిగా చెప్పటంతో పై అధికారికి విన్నవించుకున్నా పని జరగకపోవగా రెండు నెలలు అవుతున్నా నేటికి విదులకు హాజరు కానివ్వకపోవటం ఆయన రూటే సపరేటు అనటంతో ఇదొక ఉదాహరణ. కార్మికుల పట్ల దురుసుగా, మహిళా కార్మికులను దుర్భాషలాడిన సదరు ఇనస్పెక్టర్‌ను గతంలో ఒకసారి ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన ఆయన తీరు మారకపోవటం గమన్వర్హం. మరి ఇప్పటికైనా ఉన్నతాధికాదికారులు స్పందిస్తారో? లేక ప్రశ్నగానే మిగిలిపోతుందా?

ఇద్దరు అనధికారిక మేస్త్రీల హవా?

43వ డివిజన్ పారిశుధ్య విభాగంలో ఇద్దరు అనదికారిక మేస్త్రీల హవా కొనసాగుతోంది. శానిటేషన్ ఇనస్పెక్టర్ అండతో అనధికారిక వసూళ్ల దంగా తారాస్థాయికి చేరినట్లు స్థానికులు బహిరంగంగానే చర్చించుకోవటం విశేషం, ఆదివారం వచ్చిందంటే ఇద్దరు మేస్త్రీలు ఐరన్ యార్డ్ తదితర ప్రాంతాల్లో డబ్బులివ్వకుండా చేపలు, చికెన్ ఇనస్పెక్టర్ పేరు చెప్పి తీసుకోవటం, లేకపోతే వేదిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఒకే చోట ఏళ్ళు తరబడి పని చేస్తుండటంతో వీరి హవాతో అనేక అక్రమాలకు పాల్పడుతున్నట్లు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ డివిజన్‌లో శానిటేషన్ సెక్రటరీలు ఉన్నా వీరే మస్తరు తీయటం, తోటి కార్మికులకు పనులు పురమాయించటం, వారికి అనుకూలంగా ఉండేవారికి ఒక విదంగా, ప్రశ్నించే వారికి కక్ష సాదింపుతో పనులు పురమాయిస్తున్నట్లు పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందరూ ఉదయం 5.30 గంటలకు మస్తరు దిగితే వారి అనుంగులు మాత్రం 10.30 గంటలకు మస్తరు దిగటం ఆశ్చర్యం.

ఓసారి సస్పెండ్ అయినా మారని తీరు..!

సదరు శానిటేషన్ ఇనస్పెక్టర్ స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద విదులు నిర్వర్తించినప్పుడు మహిళల పట్లు దురుసుగా, అసభ్యకర పదజాలం ఉపయోగించటంతో పై అధికారులు ఒకసారి విదుల నుంచి సెస్పెండ్ చేశారు. తరువాత ఆయన మాతృ సంస్థ అయిన రెవిన్యూ విభాగానికి బదిలీ చేసినా అయినా ఆయన తీరు మారకపోవటం విశేషం. తరువాత అప్పటి కమిషనర్ బదిలీ కావటంతో తన పలుకుబడిని ఉపయోగించి మరల అక్కడ నుంచి శానిటేషన్ విభాగంలోకి ఇనస్పెక్టర్‌గా వచ్చి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు కార్మికులు ఆరోపిస్తున్నారు. సదరు ఇనస్పెక్టర్ పలు సందర్భాల్లో మహిళా కార్మికుల ఎదుటే అసభ్య పదజాలం ఉపయోగించటంతో వాటిని వినలేక మహిలు చెవులు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దీన్ని ఏమనాలి? సాడిజమా? లేక పైశాచిక అనందమా..? పై అధికారులే తేల్చాల్సి ఉంది.

17వ డివిజన్‌లో..

కృష్ణలంక రాణిగారితోట 17వ డివిజన్‌లో కూడా ఇదే పరిస్తితి కొనసాగుతోంది. ఈ డివిజన్‌లో పర్మినెంట్ శానిటేషన్ ఇనస్పెక్టర్ లేకపోవటం, స్థానిక ప్రజాప్రతినిదులు పట్టించుకోకపోవటంతో దీర్ఘ కాలంగా పాతుకుపోయిన లీడ్ మేస్త్రి ప్రవీణ్ పలు అవకతవకలకు పాల్పడుతున్నట్లు కార్మికులు చెబుతున్నారు. ఈ నేపధ్యంలోనే శనివారం కార్మికులు డివిజన్‌లోని సాంపిల్ బిల్డింగ్ వద్ద నిరనకు దిగారు. పని వచ్చినా రానట్లు మస్తరు వేయటం, రాకున్నా వచ్చినట్లు మస్తరు వేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు కార్మికులు అరోపిస్తున్నారు. డివిజన్‌లోని కోటేశ్వరమ్మ అనే కార్మికురాలు అక్టోబర్ 2న సెలవు అనంతరం ఆరోగ్యం సరిలేకపోటంతో 3, 4 తేదీల్లో సెలవు పెట్టంది. కాని మస్తరు మాత్రం 3వ తేదీ సెలవు పెట్టినట్లు, 4వ తేదీ డ్యూటీకి వచ్చినట్లు చూపించటం గమనార్హం. ఆమె రెండు రోజులు సెలవు పెట్టింది పనికి రాలేదని తోటి కార్మికులు కూడా చెబుతున్నా రానిదే మస్తరు ఎలా పడుతుందంటూ మేస్త్రీ దబాయించటం ఆశ్చర్యం. ఇలా డివిజన్‌లో మస్తరు విషయంలో, సెలవులు విషయంలో మాకు అన్యాయం జరుగుతుందని, ప్రతీ నెలా జీతం తక్కువ వస్తోందని అందుకు మేస్త్రీ ప్రవీణే కారణమంటూ కార్మికులు ఆరోపిస్తున్నారు. మస్తరు దిగి పని చేయకుండా వెళ్లి పోతున్న 10 మంది కార్మికుల నుంచి నెలనెలా మమూళ్లు తీసుకుంటుండటంతో ఆ పని భారం కూడా పని చేసే కార్మికులపై పడుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంచే చేను మేస్తే..

లీడ్ మేస్త్రీ ప్రవీణ్ వ్యవహార శైలిపై పై అధికారికి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోకపోగా ఫిర్యాదు చేసిన కార్మికులపైనే ఆగ్రహం వ్యక్తం చేయటం కంచే చేను మేసిన సందంగా ఉందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన సదరు అధికారి మేస్త్రీ ఏం చెప్తే అదే చేయాలి లేదంటే పనికి రానిచ్చేదిలేదంటూ హెచ్చరికలు జారీ చేయటంతో ముక్కున వేలేసుకోవటం కార్మికుల వంతైంది. దీంతో చేసేది లేక కార్మికులు నిరసనల బాటపట్టాల్సిన పరిస్థితి చోటు చేసుకోవటం విశేషం. కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించకోతే మరికొన్ని డివిజన్లలో నిరసనలు వ్యక్తమయ్యే పరిస్థితి ఏర్పడనున్నట్లు సమాచారం.

విద్యుత్ ఛార్జీల పెంపును ప్రతిఘటించండి

విశాలాంధ్ర-విజయవాడ : రాష్ట్రంలో విద్యుత్ బిల్లులు ప్రజలకు షాక్ ఇస్తున్నాయని విద్యుత్ ఛార్జీల పెంపుదలను ప్రతిఘటించాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ప్రచార ఉద్యమంలో భాగంగా సీపీఐ 7వ డివిజన్ ఆధ్వర్యంలో మొగల్‌రాజపురం చంద్ర రాజేశ్వరరావునగర్ కొండ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వ విధానాల్ని నిరసించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచబ్యాంకు షరతులకు వ్యతిరేకించిన తండ్రి రాజశేఖర్ రెడ్డి అయితే, అనుకూలిస్తూ ప్రజలపై భారాలు వేస్తున్న తనయుడు జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగున్నర సంవత్సరాలలో ఇప్పటివరకు ఏడుసార్లు కరెంటు చార్జీలు పెంచి సుమారు 50 వేల కోట్ల రూపాయలు భారాన్ని ప్రజలపై మోపారని, గతంలో వాడుకున్న కరెంటుకు కూడా నేడు ట్రూ అప్ చార్జీల పేరుతో వసూళ్లు చేయడం దారుణం అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు ఉపసంహరించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొండ ప్రాంతంలోని ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పై వేసే భారాల వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు అప్పురుబోతు రాము, డివిజన్ పార్టీ కార్యదర్శి పి. లక్ష్మణరావు, సహాయ కార్యదర్శులు పి. నూకరాజు, బి.మాణిక్యం, మహిళా కార్యదర్శి బి.శాంతమ్మ, మహిళా సమాఖ్య నాయకుడు అడిగర్ల దేవి, సెశెట్టి పార్వతమ్మ, పూసర్ల శ్రీనివాసరావు, తోట అంజి, చుక్కల నానాజీ, ఏ.రాంబాబు, పి.చిన్న, బందారు వరాలు, దూది రాజు తదితరులు పాల్గొన్నారు.

సానుకూల దృక్పదంతో మంచి ఆరోగ్యం: జస్టిస్ మన్మధరావు

విశాలాంధ్ర-విజయవాడ : జీవితంలో ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా ఎప్పుడూ సానుకూల దృక్పదం ఉండాలని ప్రతికూల ధోరణితో కృంగిపోరాదని, ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ మన్మధరావు అన్నారు. ఆదివారం ఎంజే నాయుడు హాస్పిటల్లో జరిగిన 37వ వార్షికోత్సవాన్ని, దాంతోపాటు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించి ప్రసంగిస్తూ మనిషిలో సానుకూల తత్వమనేది ఆరోగ్యాన్ని సైతం మెరుగుపరుస్తుందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమం-టూ ఎంజే నాయుడు అనేక ఆరోగ్యసూత్రాలు వివరించి రోగుల సందేహాలు నివృత్తి చేశారు. హాస్పిటల్ ఫౌండేషన్ గౌరవ చైర్మన్ వావిలాల వైద్యశిబిరానికి రజనీకాంత్ శర్మ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరానికి రోగుల నుండి విశేష స్పందన రావడం ముదావహం అన్నారు. సభావేదికకు, హాస్పిటల్ ఎండీ మాధవినాయుడు అధ్యక్షత వహించారు. డాక్టర్లు వంశీ కృష్ణ రవితేజ తదితరులు పాల్గొని వైద్య శిబిరంలో విశేష సేవలు అందించారు. అనంతరం జస్టిస్ మనందరావును హాస్పిటల్ యాజమాన్యం దుశ్శాలువలతో ఘనంగా సత్కరించింది. వార్షికోత్సవాల సందర్భంగా బాలల్లో ఊబకాయం అనే అంశంపై పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యంగ్య చిత్రలేఖనం, వకృత్వం, పోస్టర్ ప్రదర్శన పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు జస్టిస్ మన్మధరావు నగదు బయమతులు పంపిణీ చేశారు.

ఆసియా క్రీడల టెన్నిస్ సిల్వర్ మెడలిస్ట్ సాకేత్ మైనేనికి ప్రభుత్వ ఉద్యోగం

సన్మాన కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా ప్రకటన
-టెన్నిస్ అకాడమీ ఏర్పాటుకు స్థలం మంజూరు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : అంతర్జాతీయ బ్యాడ్మింటన్ ప్లేయర్లు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్, ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ తరహాలో ఆసియా క్రీడల టెన్నిస్ డబుల్స్ సిల్వర్ మెడలిస్ట్ సాకేత్ మైనేనికి ఉద్యోగం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖ మంత్రి ఆర్కే రోజా ప్రకటించారు. సాకేత్‌కు రాష్ట్రంలో టెన్నిస్ అకాడమీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించే ఆలోచనలో ఉందని ఆమె తెలిపారు. అందుకు సాకేత్ మైనేనికి ఉద్యోగం ఇవ్వాలని, సైట్‌ను మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఒక ఫైలును పంపిందని, దానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఆమె తెలిపారు.చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన ఆసియా క్రీడల్లో రజత పతకం సాధించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ లాన్ టెన్నిస్ అసోసియేషన్ ఆదివారం విజయవాడలోని మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ అకాడమీలో సాకేత్ మైనేని సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి మంత్రి రోజా హాజరై సాకేత్ మైనేనిని సత్కరించారు.ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలు, ఆటలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ నగదు పురస్కారాలు అందజేసి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఆసియా టెన్నిస్ డబుల్స్ రజత పతక విజేత సాకేత్ మైనేని ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని, ఈ స్థాయికి చేరుకోవడానికి ఎంతో కృషి చేశారని ఆమె తెలిపారు. గత ప్రభుత్వంలో సాకేత్ మైనేని ఓడిపోయారని ఆమె అన్నారు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి స్వయంగా చర్చించి సాకేత్ మైనేనికి ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే, రాష్ట్రంలో టెన్నిస్ అకాడమీని ప్రారంభించేందుకు సాకేత్ మైనేనికి భూమి ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని ఆమె తెలిపారు.ఇతర రంగాలతో పోల్చినప్పుడు ప్రపంచవ్యాప్తంగా దేశానికి ప్రాతినిధ్యం వహించడానికి క్రీడలు మరియు ఆటలు మాత్రమే మార్గమని ఆమె అన్నారు. విద్యార్థులు, యువకులు ఏ రంగంలోనైనా రాణిస్తారని, అయితే దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉన్న ఏకైక విభాగం మాత్రమేనని ఆమె అన్నారు. అలాగే, ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాలను చేరుకోవడానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని మరియు దాని కోసం వారి లక్ష్యం కోసం ప్రయాణంలో తలెత్తే భారాలను అధిగమించాలని ఆమె వివరించారు. సాకేత్ మైనేని క్రీడలు, ఆటలలో ఇతరులకు స్ఫూర్తి గా తీసుకోవాలన్నారు. టెన్నిస్ చాలా ఖరీదైన ఆట అయినప్పటికీ, టెన్నిస్‌లో తన 12 ఏళ్ల ప్రయాణంలో ఆసియా రజత పతకాన్ని గెలుచుకోవడానికి అతను చాలా అడ్డంకులు ఎదుర్కొన్నాడు, "అని మంత్రి రోజా అన్నారు. భారత బృందం దాదాపు 107 పతకాలు సాధించి చరిత్ర సృష్టించిందని, వారిలో తెలుగు అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖతో పాటు జ్యోతి యర్రాజీ, ధీరజ్, హారిక, హంపీ మరియు సాకేత్ కూడా భాగమని ఆమె పేర్కొంది. ఇదిలా ఉండగా రాష్ట్ర విభజన వల్ల క్రీడలు, ఆటల సౌకర్యాలు లేవని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దశలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలు, ఆటలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆమె తెలిపారు. విద్యలో క్రీడలు ఒకటని, కాబట్టి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రీడలు, ఆటలు నేర్చుకోవాలని ఆమె సూచించారు.క్రీడలు, ఆటలు శారీరక దృఢత్వం మరియు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయన్నారు. విద్యార్థులు, యువకులు సాకేత్ మైనేని నుండి స్ఫూర్తిని పొందాలని మరియు క్రీడలలో తమ ప్రేమపూర్వక విభాగాలలో కష్టపడి దేశానికి ప్రాతినిధ్యం వహించాలని ఆమె అన్నారు.విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్‌పర్సన్ తుమ్మల చంద్రశేఖర్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, ఆంధ్రప్రదేశ్ లాన్ టెన్నిస్ సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ కే పట్టాభి రామయ్య, కార్యదర్శి పీవీ రామకుమార్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు దేవినేని అవినాష్, బొప్పన భావకుమార్ తదితరులు పాల్గొన్నారు.అంతకుముందు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం ఆవరణలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా లాన్ టెన్నిస్ అసోసియేషన్, ఎన్టీఆర్ జిల్ల క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సాకేత్ మైనేని ఘనంగా సన్మానించారు. ఎన్టీఆర్ డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్ఏ అజీజ్ తదితరులు సాకేత్‌ను ఘనంగా సత్కరించారు.

అమెజాన్ నీల్సన్ ప్రీ ఫెస్టివ్ సర్వే ఫలితాలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): పండుగ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో, నీల్సన్ మీడియా సహకారంతో భారతదేశ వ్యాప్తంగా ఉన్న 35 నగరాల్లోని 8519 మందితో ఒక లోతైన పండుగ ముందస్తు సర్వేను అమెజాన్ ఇండియా నిర్వహించింది. అమెజాన్ ఇండియా కోసం ప్రత్యేకంగా నిర్వహించబడిన ఈ అధ్యయనం అనేది దక్షిణ భారతదేశంలోని కొనుగోలుదారుల పెరుగుతున్న ప్రాధాన్యతలు, అంచనాలు గురించిన విలువైన అంతర్దృష్టులను అందించింది. గత సీజన్‌తో పోలిస్తే, ఈ సంవత్సరం పండుగ కోసం మరింతగా ఖర్చు చేసేందుకు దక్షిణ భారతదేశంలోని 47 శాతం మంది వినియోగదారులు ఆలోచిస్తున్నట్లు ఈ సర్వే వెల్లడించింది. పండుగ షాపింగ్ కోసం, ప్రత్యేకించి కుటుంబ సభ్యులతో కలసి వేడుక చేసేందుకు, ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు అత్యంత అనుకూలంగా ఉంటాయని 80 శాతం మంది వినియోగదారులు చెప్పారు.

కేంద్ర, రాష్ట్ర పన్ను అధికారులు కలిసి పని చేయాలి : మంత్రి బుగ్గన

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దేశం మొత్తంగా పన్ను వసూలు పరంగా అన్ని వనరుల నుండి జీడిపిలో దాదాపు 16-18 శాతం మాత్రమే పన్నులు ఉండటం పట్ల తన నిరాశను వ్యక్తం చేసిన ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి శ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, దేశవ్యాప్తంగా పన్ను వసూళ్ళను క్రమబద్ధీకరించడానికి, జీడీపీ నిష్పత్తికి పన్నును 32-40శాతం కి పెంచటానికి కేంద్ర మరియు రాష్ట్ర పన్ను అధికారులు కలిసి పనిచేయాలన్నారు.హాట్ బటన్ టాక్సేషన్, ట్రేడ్ మరియు స్టేట్ ఫైనాన్స్ సమస్యలపై చర్చల కోసం భారతదేశం యొక్క మార్గదర్శక ఫోరమ్ - టిఐఓఎల్ టాక్స్ కాంగ్రెస్ 2023' లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిఐఓఎల్ నేషనల్ టాక్సేషన్ అవార్డ్స్ 2023 కూడా జరిగాయి. అవార్డు ప్రదానోత్సవం వేదికపై ఆయనతో పాటు సిబిఐసీ మాజీ చైర్‌పర్సన్ ప్రవీణ్ మహాజన్, సిబిడిటి మాజీ చైర్మన్ ఎంసీ జోషి, పీడబ్ల్యూ సీ మాజీ చైర్మన్ దీపక్ కపూర్ మాపుల్ హైవేస్ సీఈఓ అనుప్ వికల్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.63 లక్షల వెండి బహూకరణ

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారికి సుమారు రూ.1.63 లక్షల వెండిని వడర్లపాడు గ్రామం, కైకలూరు మండలం ఏలూరు జిల్లా వాస్తవ్యులు వడుపు తులసిరామ ఆనంద్‌కూమర్ దంపతులు సదరు వెండిని ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఇంజం చెన్న కేశవరావు మరియు ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వర రావు కిఆదివారం జేయడం జరిగినది.దాతలకు శ్రీ అమ్మవారి ప్రసాదం మరియు ఆశీర్వచనం అందజేయడం జరిగినది.

బొగ్గవరపు వెంకటేశ్వరరావు విజ్ఞాన కేంద్రం శంకుస్థాపన

విశాలాంధ్ర-వత్సవాయి : స్థానిక బొగ్గవరపు వెంకటేశ్వరరావు విజ్ఞానకేంద్రం విజయవాడలో బాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం పార్టీలకు అతీతంగా మతాలకు, కులాలకు సంబంధం లేకుండా చేస్తుందని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు క్రాంతి అన్నారు. ఆదివారం శ్రీ వెంకటేశ్వర టాలెంట్ స్కూల్ ఎదురుగా కీర్తిశేషులుబొగ్గవరపువెంకటేశ్వరరావు విజ్ఞాన కేంద్రం నూతనంగా శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీవీవీ విజ్ఞాన కేంద్రం 2016లో ప్రారంభించడం జరిగిందని అన్నారు. మొదటి కోవిడ్ దశలో ఎవరు చెయ్యని విధంగా 500 మంది రోగులకు ఎనిమిది మంది డాక్టర్ల సహాయంతో వైద్య సేవలు అందించి బ్రతికించామని తెలిపారు విజ్ఞాన కేంద్రంలోవిద్య,వైద్యం ,శిక్షణ, సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడే విధంగా చేపట్టాలని అన్నారు. ప్రజల విజ్ఞాన కేంద్రంగానిలపాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేయటం హర్షించదగ్గ విషయం అని తెలిపారు. విజయవాడ బాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు రామరాజు మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రంలో పనిచేయటం వల్లే నేను ఆరోగ్యంగా సంతోషంగా ఉన్నానని అన్నారు. విజ్ఞాన కేంద్రం కట్టడం ఒక ఎత్తు అయితే నడపటం కూడా మరో ఎత్తు అని ఇది సక్రమంగా జాగ్రత్తలు తీసుకొని నడపాలని అన్నారు. జిల్లా నాయకులు డీవి కృష్ణ మాట్లాడుతూ సమాజ సేవ చేసేవారు గ్రామాల్లో కరువయ్యారని తెలిపారు. నిర్మాణం, ఆశయం, ఆలోచనలో భాగస్వామ్యం ప్రతి ఒక్కరూ కావాలని ఇంటింటికి ఒక ఇటుక తెచ్చి ఈ కేంద్రాన్ని నిర్మించాలని పేర్కొన్నారు. అనంతరం స్థల దాతలు డాక్టర్ పులిపాటిచంద్రశేఖర్ పు ష్పావతిని శాలువాతో కప్పిపూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలోబొగ్గవరపుహనుమంతరావు, బత్తినేని వెంకటేశ్వరరావు, ఎంపీపీ కో లుసు రమాదేవి, కౌలు రైతు సంఘంనాయకులు తమ్మినేని రమేష్, రైతుసంఘం నాయకులు తమ్మినేని రాంబాబు, నియోజకవర్గనాయకులు చిరుమామిళ్లహనుమంతరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చీన మోలు సైదులు ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు బొగ్గవరపు వెంకట రాజారావు, కౌలు రైతు సంఘం జిల్లాఉపాధ్యక్షులుమండేపూడి చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ భూక్యా రాజా నాయక్, జగ్గయ్యపేట మండల నాయకులు నాగమణి, పొలంపల్లి మాజీ సర్పంచి తమ్మినేని నిర్మల, కంచర్ల కొండయ్య, మండల కార్యదర్శి బి రాము తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మానంద రెడ్డి స్టేడియం అభివృద్ధికి డైరెక్టర్లు, కార్యవర్గం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పది రోజుల్లో బ్రహ్మానంద రెడ్డి స్టేడియం అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు, కార్యవర్గాన్ని పూర్తి స్థాయిలో ఏర్పాటుకు తీర్మానించినట్లు మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బ్రహ్మానందరెడ్డి స్టేడియం నందు పరిసరాల పరిశుభ్రత-శ్రమదానం,అలాగే బ్రహ్మానంద రెడ్డి స్టేడియం అభివృద్ధి కమిటీ సమావేశం జరి గింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎస్పీ గోలి లక్ష్మయ్య బ్రహ్మానంద రెడ్డి స్టేడియం అభి వృద్ధి కమిటీ విధి విధానాలు... సలహాలుపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ సహకారంతో స్టేడియాన్ని దశల వారీగా అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. స్టేడియంలో విద్యుత్ దీపాలు, త్రాగునీటి వసతులు కల్పించాలని అధికారులకు విన్నపం అందించాలని తీర్మానించినట్లు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ మీరావలి మాట్లాడుతూ స్థానిక ప్రముఖులతో పాటు హాజరైన 200 పైగా వాకర్స్, శ్రేయోభిలాషులు స్టేడియం అభివృద్ధి పనులకు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు టీడీపీ ఇన్‌ఛార్జ్ నజీర్ అహ్మద్, టీడీపీ నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, శివాలయం దేవస్థానం చైర్మన్ మాధవ్, సైకం శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, కార్యదర్శి వర్రె సుబ్రమణ్యం, కోశాధికారి టీవీ సాయిరాం, ఎక్జిక్యూటివ్ మెంబర్ టి. తిరుపతిరెడ్డి, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌విత్‌యూ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సమాజంలో అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవసేవే మాధవ సేవ అనే నిర్వచనానికి సరైన అర్థం పలుకుతూ ముందుకు సాగుతున్న విఆర్‌విత్‌యూ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు అన్నారు. ఆదివారం స్థానిక నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగిన విఆర్‌విత్ యూ చారిటబుల్ ట్రస్ట్ ఐదో వార్షికోత్సవ వేడుకల్లో శ్రీధర్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఒక విద్యార్థిగా తాను చదువుకుంటూ సమాజం పట్ల బాధ్యత కలిగి తాను బ్రతుకుతున్న సమాజంలో సమాజానికి కొంత మేలు చేయాలని ఉద్దేశంతో పొరుగువారికి ఆపదలో ఉన్నవారికి అపన హస్తం అందిస్తూ సాయపడాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది వాలంటీర్లు ఏర్పాటు చేసి సేవలందించడం అభినందనీయమని అన్నారు. ట్రస్ట్ ఫౌండర్ అయ్యప్ప మాట్లాడుతూ సమాజంలో విద్య వైద్యం విషయంలో అనేకమంది ఇబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వారందరికీ మనో ధైర్యాన్ని నింపి వారిలో ఉన్న ప్రతిభను ప్రోత్సహిస్తూ ఆపదలో వున్న వారికి ఆపన్నహస్తాన్ని అందించేందుకు వీఆర్‌విత్‌యూ ట్రస్టు ఏర్పాటు చేయటం జరిగిందని , ఇప్పటివరకు రెండు వేల మంది వాలంటీర్లతో సేవలందిస్తున్నామన్నారు. వార్షికోత్సవం సందర్భంగా అత్యంత నిస్వార్థంగా పనిచేసిన పలువురికి అవార్డులతో సత్కరించారు. ఆపద్భాంధ సర్వీస్ సొసైటీ జాగర్లమూడి ఆంజనేయులు, పదాల చారిటబుల్ ట్రస్ట్ పదాల సూర్యప్రసాద్, వివిఐటి చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ వివిధ ప్రాంతాలకు చెందిన ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శకం 'కన్న మాష్టార్'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పేద విద్యార్థుల భవిష్యత్‌కు కన్న స్కూల్ పెట్టి ఎంతో మందికి మార్గదర్శకంగా నిలిచిన వ్యక్తి కన్న మాష్టార్ అని ఎస్సై రమేష్ పేర్కొన్నారు. ఆచార్య నాగా ర్జున యూనివర్సిటీ పాలక మండలి సభ్యులుగా నియమితులైన కన్న మాస్టర్‌ను స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ దేవరపల్లి కొండలు (డీకే)ఆధ్వ ర్యంలో ఎస్సై రమేష్ ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా ఎస్సై రమేష్ మాట్లాడుతూ గొప్ప మానవతావాది కన్న మాష్టార్ అని కొనియాడారు. స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ కొండలు మాట్లాడుతూ మంచికి మారుపేరు కన్న మాష్టార్ అని, ఒక వైపు విద్యార్థులకు విద్యను అందిస్తూ..మరోవైపు ప్రజాసేవా కార్యక్రమాలు చేస్తూ మంచి మనస్సున్న విద్యాదాత కన్న మాష్టార్ అని ప్రశంసించారు. బీఆర్ అంబేద్కర్-జాషువా-పూలే-పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షులు విల్సన్ మాట్లాడుతూ గొప్ప విద్యాదాత కన్న మాష్టార్ అని పేర్కొన్నారు. కన్న మాష్టార్‌ను సన్మానిం చిన వారిలో లక్ష్యం పత్రిక ఎటర్ మధుబాబు, నిరుద్యోగ ఐక్యవేదిక ప్రెసిడెంట్ సుబ్ర హ్మణ్యం, జై భీమ్ ప్రెసిడెంట్ నీలం బరం, అంబేద్కర్, డేవిడ్ విలియం ఉన్నారు.

చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర-తాడేపల్లి: టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్ర బాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ ఆదివారం చిర్రావూరులో టిడిపి, జనసేన పార్టీల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి తాడేపల్లి మండల అమరా సుబ్బారావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని అన్నారు. అక్రమ అరెస్టులతో భయభ్రాంతులకు చేయాలని వైసిపి ప్రయత్నిస్తుందని అన్నారు. అరెస్టులకు భయపడేది లేదని హెచ్చరించారు. గుంటూరు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా చంద్రబాబు నాయుడుకి మద్దతు తెలుపుతున్నారని అన్నారు. జనసేన పార్టీ చిరావూరు గ్రామ అధ్యక్షులు అంకం కాళీ కృష్ణ, టీడీపీ చిర్రావూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు, అడప విజయ్, నల్లబోయిన శ్రీనివాసరావు, పిల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేత

విశాలాంధ్ర-మంగళగిరి : పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ మంగ ళగిరి బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఇద్దరు పేద చేనేత కుటుంబా లకు చెందిన విద్యార్థులకు రూ.25 వేల ఆర్థిక సహాయం అందించారు. అసోసియేషన్ అధ్యక్షులు అవ్వారు సత్య కృపాల్ డాంగే, ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, కోశాధికారి బట్టు నారాయణరావు, ఉపాధ్యక్షులు గంజి రవీంద్రనాథ్, కార్యవర్గ సభ్యురాలు గోలి కస్తూరి సహాయం అందించారు. కీర్తిశేషులు ప్రగడ ఆది సుదర్శన సుందర్ రావు జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రగడ అజయ్ రూ.10 వేలు ఒక విద్యార్థికి అందించగా.. కొందరు దాతల సహకారంతో ఫామ్ డి ఐదవ సంవత్సరం చదువుతున్న కోదాటి ఈశ్వర కుమార్‌కు రూ.15 వేలు, బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న తుమ్మ బాలాజీకి రూ.10 వేలు అందజేశారు.

సమాజంలో అధికంగా మానసిక సమస్యలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నేటి సమాజంలో అధికంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నారని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు, కాటూరి మెడికల్ కాలేజీ మానసిక వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కె.సురేష్‌కుమార్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు సందర్భంగా స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో వివిధ రకాల మానసిక రుగ్మతల గురించి ఆరోగ్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ అందని స్థాయికి ఆశపడి ఆదుకోవాలని ప్రయత్నం చేసి ఫలితం లేక నిరుత్సాహంతో..మానసికంగా కృంగిపోవటం..అడ్డదారులలో లక్ష్యాలను చేధించే ప్రయత్నం చేసి ఇటు ప్రయత్నం చేసేవారు..అటు ప్రయత్నంలో నష్టపోయే వారు ఇరువురు మానసికంగా సమస్యలకు గురికావడం, అనవసర ఖర్చులు పెంచుకుని ఆ ఖర్చులకు తగిన ఆదాయం లేక మానసికంగా ఆందోళనకు గురికావడం జరుగుతుందన్నారు. పూర్వం ఉమ్మడి కుటుంబంలో సమస్యలు వస్తే తోడుగా అన్నదమ్ములు, పెద్దలు ఉండేవారని, కానీ నేడు ఆ పరిస్థితి కనుమరుగైందని ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యలు వచ్చినపుడు మన మంచి కోరే వ్యక్తులతో పంచుకున్నప్పుడే మనసుకు ఒత్తిడి తగ్గుతుందన్నారు. వయసు పెరిగే కొద్ది మతిమరుపు సమస్య కూడా పెరుగుతుందన్నారు. మతిమరుపు రాకుండా ఉండేందుకు పజిల్స్ చేయడం, కొత్త విషయాలు నేర్చుకునే ప్రయత్నం చేయడం లాంటివి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హరి మానస, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ రాజ రాజేశ్వరి, డాక్టర్ అపూర్వ, డాక్టర్ యాస్మిన్, డాక్టర్ లక్ష్మీలు మానసిక సమస్యలు గురించి అవగాహన కల్పించారు.

దసరా ఫెస్టివల్ ఎగ్జిబిషన్ ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నగరవాసులు దసరా పండుగ సందర్భంగా ఆహ్లాదకర వాతావరణలో కుటుంబ సభ్యులు అంద రితో ఆనందంగా గడిపేం దుకు దసరా ఫెస్టివల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు జి.జానకి రామ్ పేర్కొన్నారు. స్థానిక లాడ్జి సెంటర్లోని ఏఎల్ బిఈడీ ప్రాంగణంలో దసరా ఫెస్టివల్ ఎగ్జిబిషన్ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఏఈఎల్‌సి మోడల్ బిషప్ మోస్ట్ రెవరెండ్ పరదేశి బాబు, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. నిర్వాహకులు జానకిరామ్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌లో లేడీస్ క్లాత్ ఐటమ్స్, హైదరాబాద్ బ్యాంగిల్స్, మట్టి గాజులు, చిన్న పిల్లలకు సంబంధించిన ఆట వస్తువులు, బొమ్మలు, లేడీస్ జ్యువెలరీ ఐటమ్స్, ప్లాస్టిక్ వస్తువులు, గృహ అలంకరణ వస్తువులు వంటి వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా ఆహ్లాదాన్ని కలిగించే రంగులరాట్నం, డిస్కో డాన్స్, చిన్నపిల్లలకు సంబంధించిన వివిధ రకాల ఆట వస్తువులు ఏర్పాటు చేయటం జరిగిందని, ఈ ఎగ్జిబిషన్ నెల రోజుల పాటు గుంటూరు నగర ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

హోదా కోసం విజయరాజు ఆమరణ నిరాహార దీక్ష

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, రాష్ట్రానికి రాజధాని కావాలని కోరుతూ నవోదయం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నల్లక విజయరాజు గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆదివారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ శిబిరాన్ని పీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, ప్రత్యేక హోదా రాష్ట్ర జేఏసీ కన్వీనర్ ఎస్కే జిలాని, బడుగు, బలహీన వర్గాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రామరాజు, ఈమని చంద్రశేఖర్, ఖాజావలి తదితరులు సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నవోదయం పార్టీ నాయకులు నల్లక భరత్, సీహెచ్ మార్కండేయులు, కవిత, ఎస్.శ్రీను, కె.ఏడుకొండలు, నాగరాజు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ తట్టుకోలేక అక్రమ కేసులు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: టీడీపీ అధినేత చంద్ర బాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక అక్రమ కేసు లు బనాయించారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర(నానీ) ఆరోపించారు. కోవెలమూడి రవీంద్ర ఆధ్వర్యంలో 25వ డివిజన్ అధ్యక్షుడు గాలం వెంకటేశ్వర్లు నేతృత్వంలో శ్రీలక్ష్మి నగర్ మెయిన్ రోడ్డులో ఆదివారం రిలే నిరాహారదీక్షలు జరిగాయి. జిల్లా టీడీపీ అధ్యక్షులు తెనాలి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ జగనమోహన్ రెడ్డి పదవి చేపట్టిన మొదటి రోజు నుంచే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. జగన్ లాంటి క్రిమినల్ మైండ్ ఉన్న వ్యక్తి ప్రపంచంలోనే ఏవరు లేరని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించేందుకు ప్రజలు అంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నవ సుబ్బారావు, ఏ.యస్ రామకృష్ణ, సుఖవాసి శ్రీనివాసరావు, కనకాచారి, గాలం వెంకటేశ్వర్లు, కసుకుర్తి హనుమంతరావు, జాన్ సైదా తదితరులు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే సమాజ హితం కోసం పాటుపడాలి

విశాలాంధ్ర-గుంటూరు : చదువుకి అండగా నిలవడంలో ఎప్పుడు ముందుండే తులసి రామచంద్ర ప్రభు, బీజేపీ నాయకులు తులసి యోగీష్ ఆదివారం చౌడవరంలోని చేతనపురిలో హీల్(హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్) సంస్థలోని 125 మంది అనాథ బాలబాలికలకు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ ప్రొఫెషనల్ కమిటీ మెంబర్ తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ ఎటువంటి స్వార్థం లేకుండా ఇలాంటి తల్లితండ్రులు లేని బాలబాలికలకు తోడ్పాటునివ్వడంలోనే దైవత్వం ఇమిడి ఉంటుందని, అందువలనే తమ కుటుంబంలో ఎటువంటి శుభకార్యం జరిగిన ఇటువంటి కార్యక్రమాలు చేస్తుంటామని చెప్పా రు. అలాగే హీల్‌లో 10వ తరగతి పైబడి చదువుకునే విద్యార్థులకు తాను తన వంతుగా ఉపకారవేతనాలు అందజేస్తామని తెలియజేసారు. మీరు పెద్దవారైనా తర వాత ఉన్నత విలువతో కూడిన సమాజాన్ని నిర్మించడానికి కృషి చేయాలన్నారు. దేశం కోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. శత్రువులని తరిమికొడుతూ దేశాభివృద్ధికీ కృషి చేయాలన్నారు. తులసి యోగీష్ మాట్లాడుతూ మా నాన్న తులసి ప్రభు స్కాలర్‌షిప్‌తో చదుకున్నారని, అందుకే తాము ఆ విషయాన్ని మరువకుండా ఇప్పటి వరకు కొన్ని వేలమంది విద్యార్థులకు రూ.20 కోట్లకు పైగా ఉపకారవేతనాలు, కొన్ని పాఠశాలలో ఆన్ ఇన్ బుక్స్, నోటు పుస్తకాలు, అల్పాహారం పంపిణీ చేస్తుంటామన్నారు. అందులో భాగంగానే హీల్ శరణాలయములో అన్నదానం చేస్తున్నామని చెప్పారు. అనంతరం పిల్లలకు స్వయంగా వడ్డించి, వారితో కలిసి తులసి రామచంద్ర ప్రభు, తులసి యోగీష్ సహపంక్తి భోజనాలు చేసారు. తులసి సీడ్స్ డైరెక్టర్ తులసి అరుణ, జేకే రాంబాబు, సుమతి, హీల్ కోఆర్డినేటర్ మరుద్వతి, సూపరింటెండెంట్ పద్మ, హోమ్ మదర్స్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.